సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



అదనపు పనివేళలపై..

పలు స్కూళ్లలో అదనపు పనివేళలపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉపాధ్యాయ వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. - 8లో



స్తంభాన్ని ఢీకొట్టిన స్కూటీ

వమరవల్లి జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. - 8లో

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గంజాయి కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, పోలీసు జాగిలాలు, డ్రోన్ కెమెరాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సంకల్పం అనే పేరుతో అవగాహన కార్యక్రమాలు, ప్రధాన చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రణాళికాబద్ధంగా జిల్లాలో గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గృహ నిర్మాణశాఖ అధికారులకు స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖకు నిర్దేశించిన లక్ష్యాలు, ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా జిల్లాలో 100 రోజుల వ్యవధిలో 5 వేల గృహాలు, ఏడాదిలోపు 35 వేల గృహాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి రూఫ్ లెవెల్ పూర్తయిన భవనాలను నూరు పూర్తి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు రుణాలు ఇప్పించి వాటిని నిర్మాణాల కోసం వినియోగించుకునేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ ద్వారా గృహ లబ్ధిదారునికి 90 రోజుల పనిదినాలు కల్పించి వేతన లబ్ధి చేకూర్చాలన్నారు. హౌసింగ్ పీడీ బి నగేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పురోగతిని వివరించారు. సమీక్షలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



గోశాలకు తరలించిన ఎద్దులు

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా ఆవులు, ఎద్దులను తరలిస్తుండగా నరసన్నపేట పోలీసులు అడ్డుకున్నారు. బుధ, గురువారాల్లో తిలారు నుంచి బొలేరో వాహనాల్లో నాలుగు ఆవులు, ఎనిమిది ఎద్దులను జగ్గంపేటకు, కొత్తపేటకు తీసుకెళ్తున్నట్లు తెలుసుకుని కాపు కాసి పట్టుకున్నారు. ఆవులను, ఎద్దులను తరలిస్తున్న ద్వారపూడి మండలానికి చెందిన పోచిన నాగేంద్ర, అనకాపల్లి జిల్లా కె.కొట్టపాడు మండలం ఆలమండకు చెందిన జీలం శివకుమార్‌లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆవులను, ఎద్దులను కొత్తవలస గోశాలకు పంపామని తెలిపారు. రెండు బొలేరో వాహనాలను సీజ్ చేశామన్నారు.

టీచర్ నిజాయతీ



బాధితునికి బంగారు ఆభరణం అందిస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణారావు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల బైపల్లి గ్రామానికి చెందిన దున్న పుష్పలత పోగొట్టుకున్న 3 తులాల బంగారం ఆభరణాన్ని మామిడిపల్లి ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌వీ కృష్ణారావు గురువారం బాధితులకు అందించి తమ నిజాయతీని చాటుకున్నారు. పుష్పలత ఈ నెల 18న మార్కెట్ పనుల కోసం కాశీబుగ్గ వెళ్లి 3 తులాల బంగారం పుస్తెలతాడు పోగొట్టుకున్నారు. ఈ బంగారం కృష్ణారావుకు దొరికింది. బంగారం పోయిన విషయాన్ని పుష్పలత కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న టీచర్ కృష్ణారావు వారికి ఫోన్ చేసి బంగారం తన వద్దే ఉందని చెప్పగా.. వారు గురువారం టీచర్ ఇంటి వద్దకు వచ్చి ఆభరణాన్ని తీసుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఏఐ బృందం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఏఐ బృంద సభ్యులతో రెవెన్యూ అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు, మందస మండలాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఐదుగురు సభ్యులతో కూడిన (ఏఏఐ) కేంద్ర బృందం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టు నిర్మాణానికి అవసరమైన స్థలం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విమానశ్రాయ నిర్మాణానికి అయా మండలాల రెవెన్యూ పరిధిలో 1383.71 ఎకరాలు ఎంపిక చేసినట్లు, ఈ మేరకు స్థలాన్ని ఎంపిక చేసి నివేదికను రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనిలో భాగంగానే చీపురపల్లి, మోట్టూరు, ఒంకులూరు, అనకాపల్లి, బేతాళపురం, లక్ష్మీపురం, బిడిమి ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి యోగ్యత కలిగిన స్థలం ఉన్నట్లు అధికారులు గుర్తించామని తెలిపారు. అలాగే సెల్ టవర్లు, ఎత్తైన భవనాలు, కొండలను పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్డీఓ జి.వెంకటేష్, వజ్రపుకొత్తూరు,మందస మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

తప్పు నేతలది.. ముప్పు జనాలకు..



కొత్తూరు మండలంలోని వంశధార నదిలో మాతల–నివగాం వంతెన కింద ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్న దృశ్యమిది. వంతెనకు ప్రమాదం పొంచి ఉంది. వంతెనకు 500మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా ఈలోపే ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీని వల్ల వంతెనకు ముప్పు వాటిల్లనుంది.

గార–కళింగపట్నం వెళ్లే దారిలో వంశధార నది నుంచి 32 గ్రామాలకు తాగునీరు అందించే ఇన్ ఫిల్టరేషన్ బావి దగ్గరలో ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారు. రోజుకి 4 లక్షల లీటర్లు నీరు అందించే పథకమిది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకార ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించారు. ఈ ఫిల్టరేషన్ బావికి 500 మీటర్లు వరకు ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనలున్నా సమీపంలోనే ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. భవిష్యత్‌లో ఇన్‌ఫిల్టరేషన్ బావికి ముప్పు వాటిల్లనుంది.





నరసన్నపేట మండలంలోని గోపాలపెంటలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు ఇది. నాలుగెకరాల 73 సెంట్లలో తవ్వకాలకు అనుమతి ఇవ్వగా కానీ నిర్వాహకులు అందుకు భిన్నంగా నదికి అన్ని వైపులా తవ్వేస్తున్నారు. మార్చి 13వ తేదీ వరకు తవ్వకాలు జరుపుకోవడానికి అవకాశం ఉండటంతో అనుమతికి మించి తవ్వకాలు జరిపేస్తున్నారు.

శ్రీకాకుళం నగరంలోని హయాతినగరానికి ఆనుకుని ఉన్న నాగావళిలో ఇసుక ర్యాంపు నిర్వహణకు అనుమతి ఇవ్వగా ఎచ్చెర్ల మండలం పరిధిలోని తోటపాలెం గ్రామ పరిధిలో శ్మశానానికి 1100 మీటర్ల దూరంలో తవ్వకాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శ్మశానం పక్కనే బాట వేశారు. ఇదంతా టీడీపీ నాయకుడు జగదీష్ ఇక్కడ అంతా తానై వ్యవహరిస్తున్నారు.



- ఇసుక తవ్వకాలతో నదుల విధ్వంసం
- వాల్టాకు తూట్లు
- వంతెనలు, నీటి బావుల వద్ద తవ్వకాలు
- అనుమతులకు మించి తవ్వుతున్న పరిస్థితులు
- దోపిడీకి గురవుతున్న రూ.వందల కోట్ల విలువైన ఇసుక

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో 2014–19 పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం నదులనే కాదు వాగులు, వంకలను వదల్లేదు. ఇసుక దోపిడీకి తెగబడి ఉన్న ఫలంగా రూ.కోట్లకు పడగెత్తారు. నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదులు అప్పట్లో ఎంత బక్కచిక్కిపోయాయో అందరికీ తెలుసు. మళ్లీ ఇప్పుడు అదే జరుగుతోంది. అధికారంలోకి రావడమే తరువాయి ఇసుకపై పడ్డారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో సంపాదన లక్ష్యాన్ని అధిగమించేశారు. ఎక్కడికక్కడ అనధికారికంగా ఇసుక తవ్వేసి నదులను మింగేశారు. అధికారికంగా అనుమతులిచ్చిన చోట కూడా అక్రమాలకు పాల్పడుతున్నారు. నదులను ఏకంగా గుల్ల చేసేస్తున్నారు.

విధ్వంసం ఇలా...

- జిల్లా శాండ్ కమిటీ పర్యావరణ అనుమతులున్న రీచ్‌ల నుంచే ఇసుకను తవ్వాల్సి ఉన్నా అనుమతులతో సంబంధం లేకుండా, పర్యావరణ చట్టాలకు, నిబంధనలకు తూట్లు పొడుస్తూ నదుల్లో కాసుల వేట సాగిస్తున్నారు.
- వంతెనలకు, ఇరిగేషన్ పంపులు, వాటర్ ఫిల్టర్ సంపులకు 500మీటర్లు దూరంలో ఇసుక తవ్వకాలను చేపట్టాలి.
- కానీ నిబంధనలు ఎక్కడా పట్టించుకోలేదు. వంతెనలు, నీటి బావుల దగ్గరల్లో తవ్వేస్తున్నారు.
- ఎట్టి పరిస్థితుల్లోనూ నది లోపలకు మిషనరీ వాహనాలు వెళ్లకూడదు.
- కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా విధ్వంసమే జరుగుతోంది.
- అనుమతులిచ్చిన చోటే కాకుండా పక్కనున్న ఏరియాలో ఇసుక తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు.
- సాయంత్రం 6గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదని నిబంధనలు ఉన్నా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ ర్యాంపుల్లో జేసీబీలు, పొక్లెయినర్లతో తవ్వకాలు జరిపేస్తున్నారు.
- లారీలను నేరుగా నదిలోకి తీసుకెళ్లి ఇసుకను నింపేస్తున్నారు.
- నదుల్లోకి రోడ్డు లేసి మరీ తవ్వుకుపోతున్నారు.

కానరాని నిఘా..

అనుమతులిచ్చిన ఇసుక ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వాటి ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయాలి. నిర్దేశిత వేళల్లో తవ్వకాలు జరుపుతున్నారో లేదో చూడాలి. ఏయే వాహనాలు వస్తున్నాయో వాటిని రికార్డు చేయాలి. ఎంత ఇసుకను తవ్వుతున్నారో ఎంత ఇసుకను తరలిస్తున్నారో నమోదు చేయాలి. ప్రభుత్వం నిర్దేశించిన చలానా మేరకు ఇసుక లోడింగ్ చేస్తున్నారో లేదో చూసుకోవాలి. అనధికార వసూళ్లకు చెక్ పెట్టాలి, కానీ ప్రస్తుతం ఏ ఇసుక ర్యాంపు వద్ద ఇలాంటి నిఘా లేదు. ఒక్కో లారీకి రూ.10వేల నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నారని సాక్షాత్తు లారీ యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు నేరుగా కలెక్టర్ గ్రీవెన్సెల్‌కు వచ్చి ఫిర్యాదు చేశారంటే ర్యాంపుల్లో ఎంత బరితెగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇసుక లారీలు అడ్డగింత



గారలో రాత్రి పూట ఇసుక తరలిస్తున్నారని వాహనాలను అడ్డుకుంటున్న స్థానికులు

గార: గార శివారు ప్రాంతంలోని ర్యాంపు నుంచి ఇసుక రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా తరలించుకుపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఇసుకతో వెళ్తున్న లారీలను అడ్డగించి నిలిపేశారు. 20 టన్నులు నుంచి 35 టన్నుల బరువుండే లారీలు వెళ్తుండటంతో రోడ్డు పక్కనున్న ఇళ్లల్లో ఉన్నవారందరూ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పలువురు రోడ్డుపైకి వచ్చి వాహనాలను అడ్డుకున్నారు. వాస్తవానికి సాయంత్రం ఆరు గంటల తర్వాత ఇసుకను తరలించకూడదని నిబంధనలున్నా పట్టించుకోవడం లేదు. స్థానిక ఎస్ఐ ఆర్.జనార్దన సర్దిచెప్పడానికి వెళ్లి.. అనుమతులు ఉన్నాయని చెప్పగా..స్థానికులు చూపించాలని కోరారు. కానీ ఆయన చూపలేకపోవడంతో వాగ్వాదం జరిగింది.

సాయం లేకుండా సంబరాలెందుకు..?

అరసవల్లి: ప్రపంచ మత్స్యకార దినోత్సవం నాడైనా మత్స్యకారులకు ఆకలి తీర్చేలా ఎలాంటి భరోసా ఇవ్వలేని ఈ సంబరాలెందుకని జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షులు కోనాడ నర్సింగరావు, మాజీ అధ్యక్షులు మైలపల్లి నర్సింగరావులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మత్స్యకార డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ప్రపంచ మత్స్యకార దినోత్సవాల్లో మత్స్యకార నేతలు సంయుక్తంగా ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. వేట నిషేధ సమయం పూర్తయి ఆరు నెలలవుతున్నా.. నేటికీ కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. అర్హుల పేరుతో రీసర్వే అంటూ కాలయాపన చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా మత్స్యకారులకు మేలు చేయకపోతే ప్రశ్నిస్తామని, గత ప్రభుత్వం రూ.10 వేలు చొప్పున భృతిని ఐదేళ్ల పాటు అందించిందని, ఇప్పుడెందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. అలాగే భృతిని రూ.20 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించిన కూటమి ప్రభుత్వం అర్హులను వెంటనే గుర్తించి భృతిని అందజేయాలన్నారు.

మహమ్మారి ఆకలి.. మరో ప్రాణం బలి



కుమారి బిసాయి మృతదేహం

ఆమె వయసు పద్నాలుగేళ్లు.. ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా తిరగాల్సిన అమ్మాయి. ఇంత చిన్న వయసులోనే ఆమె కిడ్నీలు పాడైపోయాయి. ఇప్పటికే 40 సార్లు డయాలసిస్ చేయించుకుంది. 41వ సారి డయాలసిస్ చేయించుకోవడానికి వచ్చి ప్రాణాలు కోల్పోయింది. మరో 14 రోజుల్లో ఆమె పుట్టిన రోజు రానుంది. అయితే పలాస కిడ్నీ ఆస్పత్రిలోని సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సమయానికి చికిత్స అందించి ఉంటే బాలిక బతికేదని అంటున్నారు. వైద్యుల వాదన మాత్రం మరోలా ఉంది. హైబీపీ కారణంగానే అమ్మాయి చనిపోయిందని చెబుతున్నారు. బాధితురాలి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. – కాశీబుగ్గ

- కిడ్నీ వ్యాధితో 14 ఏళ్ల బాలిక మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే: తల్లిదండ్రుల ఆరోపణ
- డయాలసిస్ చేయడంలో ఆలస్యం చేశారని మండిపాటు
- హైబీపీతో చనిపోయిందంటున్న వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న మృతురాలి తల్లి, సోదరుడు

కంచిలి మండలం తలతంపర గ్రామానికి చెందిన కుమారి బిసాయి (14) అనే బాలిక కిడ్నీ వ్యాధితో మృతి చెందింది. ఈమె కిడ్నీలు పాడైపోవడంతో ప్రతి వారం సోంపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో వైద్యం తీసుకునేది. బుధవారం అక్కడ బీపీ పెరిగిపోవడంతో సోంపేట నుంచి పలాస కిడ్నీపరిశోధన కేంద్రానికి రిఫర్ చేశారు. ఆగమేఘాలపై ఆమెను ఇక్కడకు తీసుకువచ్చారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు తీసుకువచ్చినా కిడ్నీ స్పెషలిస్టులు ఆమెకు చూడకుండా అత్యవసర (ఐసియు)విభాగంలో ఉంచేశారు. అనంతరం పలుమార్లు డయాలసిస్ యూనిట్‌లో సిబ్బందికి అక్కడి సిస్టర్లు సూచించినా పట్టించుకోలేదు. కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ యర్రా రాకేష్ వచ్చి చెబితేనే డయాలసిస్ చేస్తామని తేల్చి చెప్పేశారు. బుధవారం రాత్రి మరింత ఆయాసం అధికమై పరిస్థితి తీవ్రంగా మారడంతో ఉదయం ఆరు గంటలకు డయాలసిస్ చేస్తామని చెప్పారు. కానీ ఆ సమయానికి కూడా డాక్టర్లు, డయాలసిస్ యూనిట్ వారు రాకపోవడంతో ఉదయం 8 గంటల నుంచి 8 గంటల 30 నిమిషాల మధ్యలో 200లకు పైగా బీపీ పెరిగిపోయింది. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా మారి ఏకంగా చనిపోయింది.

ఈ విషయం బయటకు చెప్పకుండా బాలిక తండ్రి రాము బిసాయి, కుమారుడు రాహుల్ బిసాయి లను వైద్యులు, వైద్య సిబ్బంది బలవంతంగా బయటకు పంపించేశారు. అనంతరం పదిగంటల సమయంలో మరణించిందని చెప్పారు. వెను వెంటనే తల్లి, తండ్రి, సోదరుడు రోదించడంతో ఉన్నఫళంగా అక్కడి నుంచి మృతదేహాన్ని స్వగ్రామం కంచిలి మండలం తలతంపర గ్రామానికి తరలించారు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణం..

వైద్యులు ఉండి సరైన సమయానికి డయాలసిస్‌తో పాటు ఇతర అత్యవసర వైద్య సేవలు అందించకపోవడం వల్లనే తన బిడ్డ చనిపోయిందని తల్లి కమల బిసాయి తీవ్రంగా ఆవేదన చెందింది. రూ.3500 చెల్లిస్తామన్నా డయాలసిస్ చేయలేదని అన్నారు. కిడ్నీ వ్యాధి అంటే ఏంటో కూడా ఆమెకు తెలీదని, తగ్గిపోతే స్కూలుకు వెళ్తానని నవ్వుతూ చెప్పేదని ఆమె చెప్పారు. హోటల్‌లో పనిచేస్తున్న బాలిక తండ్రి రాము బిసాయి కష్టపడిన డబ్బులు పాపకు ఖర్చు చేసేవారమని, పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఇదివరకు రూ.40వేలు ఖర్చుచేసి ఆపరేషన్ చేయించినా ఫలితం లేకపోయిందన్నారు.

హైబీపీనే మృతికి కారణం




కుమారి బుధవారం ఆస్పత్రికి చేరుకున్న విషయం వాస్తవమే. అయితే గురువారం వైద్య సేవలు అందించినప్పటికీ బీపీ 200 లకుపైగా పెరిగిపోవడంతో ఆమె చనిపోయింది. శాచురేషన్ 56 నుంచి 57 మధ్య ఉండటం తదితర కారణాలతో పాటు స్పెషలిస్టు వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో మరణించింది. – డాక్టర్ అల్లు పద్మ, సూపరింటెండెంట్, కిడ్నీ పరిశోధన కేంద్రం పలాస

క్లాసులు దూరం.. కష్టాలు అపారం



ఇక్కడ ఆధార్, టెన్త్ సర్టిఫికెట్లలో కనిపిస్తున్న విద్యార్థి పేరు కరణం లక్ష్మణరావు. ఎచ్చెర్ల మండలం వీరాయవలస గ్రామం. ఈ విద్యార్థి టెన్త్ సర్టిఫికెట్‌లో డేట్ ఆఫ్ బర్త్ 19-03-2007 ఉండగా.. ఆధార్‌లో 2007గా మాత్రమే ఉంది. దీంతో ఈ విద్యార్థి అపార్ నమోదు జరగడం లేదు. ఇప్పుడు జిల్లాలో అపార్ నమోదులో ఇవే దోషాలు, తప్పులుగా ఉండటంతో అపార్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

- విద్యార్థులను కుదిపేస్తున్న 'అపార్' నమోదు ప్రక్రియ
- సచివాలయాలు, ఆధార్‌కేంద్రాలు, నోటరీల కోసం అడ్వకేట్ల చుట్టూ ప్రదక్షిణలు
- అపార్ నమోదుకై రోజువారీ టార్గెట్లు ఇస్తూ ఒత్తిడికి గురిచేస్తున్న ప్రభుత్వం
- లెక్చరర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సైతం తప్పని ఇబ్బందులు
- విద్యార్థులకు ఉపశమనం కలిగేలా వెబ్‌పోర్టల్‌లో మార్పులు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు





శ్రీకాకుళం న్యూకాలనీ, శ్రీకాకుళం:

విద్యార్థులకు క్లాసులు సజావుగా సాగడం లేదు. ఆధార్ కేంద్రాల వద్ద విద్యార్థులు, సచివాలయాల వద్ద వారి తల్లిదండ్రులు, కంప్యూటర్ల వద్ద లెక్చరర్లు, ఉపాధ్యాయులకు రోజులు గడిచిపోతున్నాయి. ఆధార్ తరహాలో ప్రతి విద్యార్థికి అపార్ నంబర్‌ను కేటాయించాలని కేంద్రం నిర్ణయించడం, ఆ మేరకు కసరత్తులు చేయకుండా స్కూళ్లకు టార్గెట్లు ఇవ్వడంతో అటు అపార్ నమోదు పూర్తి కాక ఇటు క్లాసులు సరిగా సాగక విద్యా సంవత్సరంలోని రోజులన్నీ వ్యర్థమవుతున్నాయి.

ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 'అపార్' పేరిట 12 అంకెలతో కూడిన ఒక నంబర్‌ను కేటాయించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన 'అపార్' (ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్‌లో ఒక నంబర్‌ను కేటాయిస్తారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేయనున్నారు.



ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం సచివాలయంలో ఎస్‌ఏసీ కోసం వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

విద్యార్థులే బాధితులు..

అపార్ అందించే ప్రక్రియలో విద్యార్థులను ఆఖరికు బాధితులుగా చేస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులను, పాఠశాల విద్యార్థులను ఇప్పుడు 'అపార్' కుదిపేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు ఏకంగా కలెక్టరే రోజువారిగా విద్యా సంస్థలకు టార్గెట్లను నిర్దేశిస్తుండటంతో అక్కడి ప్రిన్సిపాళ్లు/హెచ్ఎంలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో గత పదిరోజులుగా క్లాసులకు నోచుకోకుండా సచివాలయాలు, ఆధార్ కేంద్రాలు, నోటరీల కోసం అడ్వకేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వీటన్నింటికీ ఈ పేద, మధ్య తరగతి విద్యార్థులు రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తున్నారు. మరో పక్క క్లాసులు జరగక సిలబస్‌లు పూర్తి కావడంలేదు. దీనికి తోడు పరీక్షలు సమీపిస్తుండటంతో విలువైన సమయాన్ని నష్టపోతుండటంతో.. ఈ ప్రభావం పబ్లిక్ ఫలితాలపై తప్పకుండా పడతుందేమోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

'ఆ రెండే' ప్రధాన సమస్య

పాఠశాల విద్యార్థులను అటుంచితే.. జూనియర్ కళాశాలల విద్యార్థుల సమస్య జటిలమైంది. వారికి పదో తరగతి మార్క్స్ మెమోకు, ఆధార్‌కార్డుకు 80 శాతం వరకు వ్యత్యాసాలు ఉండటంతో నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థి పేరు, వారి జనన తేదీ ఈ రెండే విద్యార్థుల పట్ల ప్రధాన సమస్యగా పరిణమించాయి. ఆధార్ మార్పులు జరగాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దానికి ఎస్ఏసీ చేయించాలి. సచివాలయాల్లో ఎస్ఏసీ చేయించాలంటే అడ్వకేట్ ధ్రువీకరించే నోటరీ అవసరమవుతోంది. దీని తర్వాత మళ్లీ సచివాలయాల్లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత తహసీల్దార్, ఆర్డీవోలు ధ్రువీకరించాలి. మళ్లీ ఆధార్ కేంద్రాల్లో నమోదు కావాలి. ఆ తర్వాత సచివాలయాల్లో డేటాను నమోదు చేసుకోవాలి. ఇంత తంతు జరిగితే తప్ప ఆధార్ కార్డులు జనరేట్ కావు. సచివాలయాల వారీగా విద్యార్థులతో లెక్చరర్లు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు తిరుగుతూ నానా అవస్థలు పడుతున్నారు. యూడైస్ అపార్ వెబ్‌సైట్‌లో మార్పులు చేయాల్సింది పోయి ఇంత తతంగాన్ని పెట్టించిన ప్రభుత్వం కనీసం విద్యార్థులకు ఉపశమనాన్ని కలిగించే నిర్ణయాన్ని తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాకు సంబంధించి..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో మొత్తం పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 2840 ఉండగా వీటిల్లో 3,21,200 మంది విద్యార్థులు చదువుతుంటే.. ఇప్పటి వరకు 2.10లక్షల మంది వరకు అపార్ కార్డులు జనరేట్ అయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన వారికి అనేక సమస్యల కారణంగా కార్డులు జనరేట్ కావడం లేదు.

లెక్చరర్లకూ ఇబ్బంది



జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అపార్ నమోదు ప్రక్రియ జరుగుతోంది. అపార్ విజయవంతంగా పూర్తయిన వారు 20–30 శాతం మంది మాత్రమే. మిగిలిన వారంతా ఆధార్ మార్పుల కోసం తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. విద్యార్థుల వెంట లెక్చరర్లు సైతం తిరుగుతున్నారు.
–ఎస్.షణ్ముఖరావు, కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్

పది రోజుల నుంచి తిరుగుతున్నాం..




ఆన్‌లైన్‌లో నా అపార్ నమోదు జరగలేదు. కారణం టెన్త్‌క్లాస్‌లో ఉన్నట్టుగా నా ఆధార్ కార్డులో జన్మదిన తేదీ లేదు. కేవలం జన్మించిన సంవత్సరం(2007) మాత్రమే ఉంది. దీంతో సచివాలయాలు, ఆధార్‌కేంద్రాలు, నోటరీలకోసం లాయర్ల చుట్టూ పది రోజులుగా తిరుగుతున్నాం. – కరణం లక్ష్మణరావు

అందరి సమన్వయంతో నమోదు ప్రక్రియను పూర్తిచేస్తాం..



జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతోంది. కలెక్టర్ ఈ విషయమై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఆధార్‌కార్డులలో తప్పులతో తీవ్ర ఇబ్బందులు తలెత్తినప్పటికీ అవాంతరాలను అధిగమించేలా ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు సహకరిసున్నారు. – శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ, శ్రీకాకుళం

అపార్ అత్యంత ప్రాముఖ్యమైనది



అపార్ రిజిస్ట్రేషన్ చాలా ప్రాముఖ్యత కలిగినది. దీని వల్ల దేశంలో ఎక్కడ చదువుకోవాలన్నా సులభమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే రాయితీలు, ఇతర సౌకర్యాలు పొందేందుకు వీలు అవుతుంది. విద్యార్థికి సంబంధించిం ప్రతి ధ్రువీకరణ పత్రం ఈ డిజిటల్ రిజిస్టర్ నంబర్‌లో భద్రంగా ఉంటాయి. ఫిబ్రవరి తర్వాత పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తాయి. అందువలనే తొందరపెడుతున్నాం. – ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి

ఇంతటి ఒత్తిడి అవసరమా..



విద్యార్థులు, ఉపాధ్యాయ వర్గాలపై అపార్‌పై ఇంత ఒత్తిడి తీసుకురావడం అవసరమా. మార్చి 31 వరకు కేంద్ర ప్రభుత్వం గడువినిచ్చింది. ప్రతి విద్యార్థికి అవసరం కనుక ఈ లోగా ఆ పనిని బాధ్యతగా పూర్తిచేసుకుంటాడు. పరుగులు పెట్టించడం వల్ల మరిన్ని తప్పులు జరిగే అవకాశాలుంటాయి. రెవెన్యూ కార్యాలయాల్లో ఒక్క రోజులో పనిపూర్తయ్యేలా, పాఠశాలల్లో అడ్మిషన్ వివరాలు సరిచేసుకునేలా సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది.
– పేడాడ కృష్ణారావు, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

అక్రమ రవాణా అరికట్టాలి



హిరమండలం స్టేషన్ వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

హిరమండలం/జలుమూరు: నిషేధిత పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసులకు ఆదేశించారు. గురువారం హిరమండలం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కేసుల వివరాలను సీఐ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎస్ఐ మహమ్మద్ యాసీన్ ఉన్నారు. అనంతరం జలుమూరు పోలిస్‌స్టేషన్‌ను సందర్శించి మౌలిక వసతులు పరిశీలించారు. ఈయనతో పాటు నరసన్నపేట సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఒప్పంగి జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కె.తనూజ, 9వ తరగతి చదువుతున్న ఆర్.రోహిత్ అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం టి.ఉమాకుమారి తెలిపారు. ఈ నెల 15న జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరిని గురువారం ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలకు రమ్యశ్రీ



రమ్యశ్రీను అభినందిస్తున్న అధ్యాపకులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న ఆర్.వి.రమ్యశ్రీ జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ బి.గౌరీనాయుడు గురువారం తెలిపారు. డిసెంబర్ 5 నుంచి 10 వరకు కోయంబత్తూర్‌లో జరగనున్న 62వ జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున రమ్యశ్రీ ప్రాతినిధ్యం వహించనుందని చెప్పారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రమ్యశ్రీ రజత పతకం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా రమ్యశ్రీను అధ్యాపకులు అభినందించారు.

మూడు ఇసుక లారీలు సీజ్



జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ వద్ద ఇసుక లారీలు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి వద్ద మూడు ఇసుక లారీలను గురువారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. రసీదులు లేకుండా అక్రమంగా ఇసుకను విశాఖపట్నం తరలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. లారీలను స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా మైన్స్ శాఖకు అప్పగించామని తెలిపారు.

'హైటెక్'చోరుడుతో జాగ్రత్త



పోలీసులు విడుదల చేసిన నిందితుడి చిత్రమిదే

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిని ఆనుకొని పాత్రునివలస డెంటల్ కళాశాల సమీపంలోని హైటెక్ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 1న అర్ధరాత్రి చోరీ జరిగిన సంగతి తెలిసిందే. చోరీ చేసిన వ్యక్తి దృశ్యాలు అపార్ట్‌మెంట్ సీసీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. అతడి చిత్రాన్ని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ సీహెచ్ పైడపునాయుడు గురువారం విడుదల చేశారు. నిందితుడు నగర శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం తెలిసిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా తారసపడితే తక్షణమే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

అదనపు పనివేళలపై.. ఆందోళన



- ఉన్నత పాఠశాలల్లో మరో గంట పాటు తరగతులు
- ప్రస్తుతం సాయంత్రం 4 గంటల వరకే క్లాసులు
- ఇకపై 5 గంటల వరకు నిర్వహించాల్సిందే
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో 30 స్కూళ్లలో అమలు
- ప్రభుత్వ తీరు సరికాదంటున్న ఉపాధ్యాయ వర్గాలు

శ్రీకాకుళం:

ఉన్నత పాఠశాలల పనివేళలను గంటపాటు పెంచేందుకు ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం పట్ల ఉపాధ్యాయవర్గాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌవుతోంది. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలు, ప్లస్‌టూ పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంది. పదో తరగతి విద్యార్థులకు సెప్టెంబర్ నుంచి నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఉన్నత పాఠశాలల్లోని అన్ని తరగతులకు గంట పాటు పనివేళలు పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో 30 ఉన్నత పాఠశాలలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు.

ఏకపక్ష నిర్ణయం తగదు..

శీతాకాలంలో సాయంత్రం ఐదు గంటలకే చీకటి పడుతుంది. పదో తరగతి విద్యార్థులు సైతం ప్రత్యేక తరగతుల్లో ఉండేందుకు ఇష్టపడటం లేదు. అటువంటిది ఉన్నత పాఠశాలలోని అన్ని తరగతులు మరో గంట పాటు ఉంచాలని నిర్ణయించడం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని, ఈ సమయంలో చీకటయ్యే వరకు పిల్లలు ఇంటికి రాకపోతే ఎలా అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దేశంలోనే అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉన్న కేరళలో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, తెలంగాణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, తమిళనాడులో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.10 గంటల వరకు, కర్ణాటకలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, ఉత్తరప్రదేశ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మన రాష్ట్రంలో కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలు నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వం మాత్రం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించడం పట్ల ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఇటువంటి మార్పులు చేసినప్పుడు ఉపాధ్యాయ సంఘాలతో ముందుగా చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, అలా కాకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఉపాధ్యాయుల క్యాజువల్ లీవ్‌పైనా కఠిన ఆంక్షలు విధించారు. ఇదివరలో ప్రధానోపాధ్యాయులకు చెప్పి, ఆన్‌లైన్ యాప్ ద్వారా సీఎల్ నమోదు చేసుకుంటే సరిపోయేది. ఇకపై అలా కాకుండా అధికారుల అనుమతి తప్పనిసరి చేసింది. అలాగే మండల పరిధిలో, స్కూల్ కాంప్లెక్సు పరిధిలో గాని ఆ పరిధిలో 10 శాతం కంటే ఎక్కువ మంది సెలవు తీసుకోకుండా ఉండాలని కఠిన నిబంధన విధించారు.



తరగతిలో విద్యార్థులు

ఆదేశాలు వచ్చాయి

పాఠశాలలు సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడం వాస్తవమే. పైలట్ ప్రాజెక్టుగా ప్రతీ మండలం నుంచి మూడు పాఠశాలలను ఎంపిక చేశారు. డిసెంబర్ 1 నుంచి అన్ని పాఠశాలలు పనిచేస్తాయనే ప్రచారంలో వాస్తవం లేదు. సాయంత్రం 5 నుంచి ఆరు గంటల వరకు ప్రత్యేక తరగతులు కూడా ఉండకపోవచ్చు.

– ఎస్.తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

నిలుపుదల చేయాలి

రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత పాఠశాలల పనివేళలను పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే నిలుపుదల చేయాలి. పనివేళలు పెంచడం విద్యార్థులు, ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ప్రస్తుతం ఉన్న పనివేళలు కొనసాగిస్తూనే పదో తరగతి విద్యార్థులకు మాత్రమే సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రోజుకు స్టడీ అవర్ పెట్టడం మంచిది.

– పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు, డి.టి.ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పకడ్బందీగా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే



ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

నరసన్నపేట: క్యాన్సర్ వ్యాధులు(ఎన్‌సీడీ సీడీ)కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా సర్వే చేపట్టాలని డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి అధికారులను ఆదేశించారు. గురువారం ఉర్లాం పీహెచ్‌సీని సందర్శించి సర్వే స్థితిగతులపై వైద్యులు గొలివి సుజాత, అరవింద్‌లను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలో 18 ఏళ్లు నిండిన మహిళలు 15 వేల మంది ఉన్నారని, వీరికి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని డాక్టర్ సుజాత వివరించారు. రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాధులను ఎంత త్వరగా గుర్తిస్తే చికిత్స అంత సులువు అవుతుందని డీఎంహెచ్‌ఓ చెప్పారు. పాఠశాలలను ప్రతి గురువారం, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి శనివారం సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీలు సందర్శించి పిల్లలకు ఆరోగ్య తనిఖీలు చేయాలని సూచించారు. వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

జిల్లా విద్యార్థినులకు ఉమెన్ ఏవియేషన్ పురస్కారాలు



ఉమెన్ ఏవియేషన్ సంస్థ ప్రతినిధులతో విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థినులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చారు. మహిళలను విమానయాన రంగంలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నెల 18న శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా సంస్థ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 150 మంది వరకు విద్యార్థినులు హాజరుకాగా.. తుది దశకు ఆరుగురిని ఎంపికచేశారు. వీరంతా ఈ నెల 20న విశాఖపట్నం నుంచి ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీలోని ఏరో సిటీలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ ఉల్నామ్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా సంస్థ అధ్యక్షురాలు రాధా భాటియా, ఏవియేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ పీపీఎన్ కుమార్ చేతులమీదుగా ప్రత్యేక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా నుంచి ఎర్రా అఖిల (ఎంపీసీఎస్ డిగ్రీ తృతీయ– శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల), ఆరిక అనిత (బీకాం డిగ్రీ ద్వితీయ– శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), జె.గంగోత్రి(బీకాం డిగ్రీ ద్వితీయ– శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), వై.జ్యోత్స్న (ఎంపీసీ డిగ్రీ ద్వితీయ– శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల), పి.నాగమణి (బీకాం డిగ్రీ ద్వితీయ– శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), పి.సుశీల (బీఏ డిగ్రీ ప్రథమ– శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల) పురస్కారాలను అందుకున్నవారిలో ఉన్నారు. దేశవ్యాప్తంగా 30 మంది విజేతలుగా నిలవగా అందులో జిల్లా నుంచే ఆరుగురు విద్యార్థులు ఉండటం గొప్ప విషయమని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలకు ఉచిత శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

రణస్థలం: ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలకు సంబంధించి ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులు ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామని అరబిందో కార్పొరేట్ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.బి.రాజు తెలిపారు. రణస్థలం మండలం వరిసాం సమీపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 11వ బ్యాచ్ చెందిన 25 మంది విద్యార్థులకు గురువారం స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాస్యుటికల్ క్వాలిటీ కంట్రోల్ ఎనలైటికల్ టెక్నిక్స్‌పై ఆరు నెలల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పించామని చెప్పారు. ఈ కోర్సుతో ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ రమా శ్రీనివాస్, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాబేళ్లను సంరక్షిద్దాం



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారులు

సోంపేట: అంతరించిపోతున్న సముద్ర తాబేళ్లను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అటవీశాఖాధికారులు అన్నారు. మండలంలోని బారువ కొత్తూరు గ్రామంలో సముద్ర తాబేళ్ల సంరక్షణపై గురువారం మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్రతాబేళ్లు వలకు చిక్కినప్పుడు జాగ్రత్తగా బయటకు తీయాలన్నారు. ఇవి సముద్రంలోని జీవరాశికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు రామకృష్ణ, రాఘవయ్య, రవికుమార్, సంతోష్, పోలయ్య, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు కె.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ధనుంజయ

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యకర్తలకు రెండో విడత శిక్షణ ప్రారంభించారు. జిల్లాలో 340 మంది కార్యకర్తలు ఉండగా మొదటి విడత 50 మందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఐదు రోజుల పాటు 100 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తృతంగా పెరగాలన్నారు. ప్రకృతి వ్యవసాయం అమలులో క్షేత్ర స్థాయి కార్యకర్తలు కీలకమని చెప్పారు. రసాయన ఎరువులు, పురుగుల మందులు రహిత వ్యవసాయం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

సోంపేట: సోంపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని మందస మండలం చాపరాయి గ్రామంలో 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ కె.బేబి గురువారం తెలిపారు. శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట సిబ్బంది ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు. బెల్లం ఊటతో పాటు 20 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన స్కూటీ

- యువకుడు మృతి.. మరొకరికి గాయాలు



గొర్లె కృష్ణ (ఫైల్)

గార: మండలంలోని వమరవల్లి జంక్షన్ సమీపంలో మలుపు వద్ద స్కూటీతో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఘటనలో గొర్లె కృష్ణ (25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం చినతోణంగి గ్రామానికి చెందిన గొర్లె కృష్ణ, గొర్లె గణేష్‌లు స్వగ్రామం నుంచి స్కూటీపై గార బయలు దేరారు. గణేష్ కుటుంబసభ్యుల్లో ఏడాది పాప ప్రథమ సంవత్సర పుట్టిన రోజు ఏర్పాట్లలో భాగంగా స్వీట్లు కొనేందుకు వెళ్తుండగా.. మలుపు వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని అతివేగంతో ఢీకొట్టారు. దీంతో స్తంభం విరిగి రోడ్డుపై పడిపోయింది. బండి నడుపుతున్న కృష్ణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న గణేష్‌కు కుడికాలు విరగడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం తరలించారు. కృష్ణ దుబాయ్‌లో పనులు చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటూ ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. తల్లిదండ్రులతో పాటు సోదరి ఉన్నారు. మృతుడి తండ్రి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్.జనార్దన తెలిపారు.



ఘటనా స్థలంలో స్కూటీ, కృష్ణ మృతదేహం

పనివేళల మార్పుపై పునరాలోచించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో పని వేళల పెంపుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని.. ప్రస్తుత వేళలనే యథాతథంగా కొనసాగించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తంగి మురళీమోహన్‌రావు, దానేటి కేశవరావు ప్రభుత్వానికి గురువారం విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలల్లో పాత తరహాలోనే ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించాలన్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత తప్పనిసరి



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వసతి గృహాలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ బాలసదనం, అరసవల్లి శిశుగృహ, స్త్రీ సదనం, రెడ్‌క్రాస్ సొసైటీ శాంతా కల్యాణ అనురాగ నిలయం, నాగజ్యోతి అనురాధ నిలయాలను సందర్శించి నిర్వాహకులు సూచనలందించారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రణస్థలం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పైడిభీమవరంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం కూడా రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్నురాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజా ధనాన్ని దోచిపెట్టిందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు చెప్పినా అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. సరైన రాయితీలు, పంట గిట్టుబాటు ధర లేక లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులు కాలరాసే దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.అప్పన్నాయుడు, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికకు వచ్చే అర్జీలలో పెండింగ్‌లో ఉన్న వినతులు, లోకాయుక్త, కోర్టు కేసులు, నీటి పన్ను, నాలా, రీ సర్వే, ఆర్ఓఆర్, సివిల్ సప్లయ్స్, తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. నీటి పన్ను వసూలుకు సిబ్బంది అవసరమైతే డిజిటల్ అసిస్టెంట్లను ఇస్తామన్నారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు పర్యటిస్తే చాలావరకు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించవచ్చన్నారు. ఎక్కడపడితే అక్కడ ఇసుక సేకరణకు అవకాశం లేదన్నారు. ముఖ్యంగా తాగునీటి బావులు, వంతెనల వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్నారు. రాత్రిపూట ఇసుక రవాణా జరగకూడదని చెప్పారు. ఈ–ఆఫీసుపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, ఉప కలెక్టర్లు పద్మావతి, లక్ష్మణమూర్తి, జెడ్పీ సీఈవో ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు విజయ్‌కుమార్, విభాగ పర్యవేక్షకులు సరోజని, సూర్యనారాయణ, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

తత్వశాస్త్ర అధ్యయనం అవసరం



మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: అన్ని శాస్త్రాలకు మూలమైన తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో గురువారం ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ విలువలు, సామాజిక నైతికత దిగజారినప్పుడు తత్వశాస్త్రం అవసరమవుతుందని చెప్పారు. సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ వంటి తాత్విక మేధావుల రచనలు ప్రపంచంపై ఎంతగానో ప్రభావం చూపాయన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నైతిక విలువలు బోధించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు అనురాధ, రాజశేఖరరావు, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. రగ్బీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–12 విభాగంలో బాలబాలికలకు నిర్వహించిన ఎంపిక ల్లో ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున 24 మందిని ఎంపిక చేశారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఎంపికలను ప్రారంభించారు. డిసెంబర్ 1 నుంచి రెండు రోజుల పాటు నెల్లూరు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్లు పాల్గొంటాయని అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డి.రామకృష్ణ, పి.పార్వతీశం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.నారాయణరావు వెల్లడించారు. కార్యక్రమంలో పీడీలు కె.కె.రామిరెడ్డి,సత్యనారాయణ, పి.జగదీష్, అప్పన్నమ్మ, ప్రమీల, భారతి, దుర్గ, సీతయ్య, పి.రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీల్లోనూ సత్తాచాటండి



జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో కోచ్‌లు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లోనూ విజయదుందుబి మోగించి విజేతలుగా తిరిగి రావాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా అరకొండ వేదికగా ఈ నెల 22 నుంచి 24 వరకు 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–14 బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు గురువారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లాయి. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో క్రీడాకారులను ఉద్దేశించి ఎస్.జి.ఎఫ్ జిల్లా సెక్రటరీ బి.వి.రమణ మాట్లాడుతూ పదేళ్లుగా వందలాది మంది క్రీడాకారులు సాఫ్ట్‌బాల్ రాణిస్తుండటంశుభపరిణామమన్నారు. జిల్లా పీడీ–పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ మాట్లాడుతూ కోచ్ మేనేజర్ల సూచనలను అమలుచేసి గెలుపుబాట పట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ పీడీ మెట్ట తిరుపతిరావు, కోచ్ మేనేజర్లు తోటారావు (పీడీ మాణిక్యపురం– ఇచ్ఛాపురం), ఐ.గౌరీశంకర్, పి.హరికృష్ణ, సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, బడగల హరిధర్, పీఈటీ సంఘ నేత ఎం.సాంబమూర్తి, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.